నమస్తే తెలంగాణ
వరంగల్
హనుమకొండ
5 | ఆదివారం 24 మార్చి 2024 | WARANGAL HANUMAKONDA



సోమసూత్రం పునరుద్ధరణలో భాగంగా పైపులు వేస్తున్న సిబ్బంది

# రామప్పలో సోమసూత్ర పునరుద్ధరణ పూర్తి

వెంకటాపూర్, మార్చి 23 : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంలో సోమసూత్ర పునరుద్ధరణ పనులను శనివారం పురావస్తు శాఖ అధికారులు పూర్తిచేశారు. గర్భాలయంలో అభిషేకం చేసిన నీళ్లు బయటికి వెళ్లేందుకు ఐదు రోజుల క్రితం పనులు మొదలుపెట్టగా శనివారం ముగిశాయి. ఆలయ గర్భగుడి నుంచి సోమసూత్రం గుండా నీరు వెళ్లేలా డ్రిల్లింగ్ వేసి, సుమారు 15 మీటర్ల మేర కందకం తవ్వి పైపులు వేసి నీరు ఆలయం వెలుపలికి వెళ్లేలా చేశారు. దీంతో పాటు గతంలో అభిషేకానికి నీళ్లను అర్చకులు, సిబ్బంది బిందెల ద్వారా మోసుకోగా ఇప్పుడు గార్డెన్‌లోని బోరు నీళ్లు గర్భగుడిలోకి వెళ్లేలా పైపులు అమర్చారు. దీని వల్ల భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**త్వరలో కామేశ్వరాలయ పనులు ప్రారంభం**

కామేశ్వరాలయంతో పాటు, ఆగ్నేయ దిశలో సగం వరకు కూలిన ప్రహరీ నిర్మాణానికి పురావస్తు శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలోనే కామేశ్వరాలయ పునరుద్ధరణకు కేంద్ర పురావస్తు శాఖ రూ.11కోట్లు మంజూరు చేయగా త్వరలోనే పనులను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



కామేశ్వరాలయం నిర్మాణం జరిగే ప్రదేశం

# బాలికపై లైంగిక దాడికి యత్నించిన సీఐ సంపత్ సస్పెన్షన్

**ఉత్తర్వులు జారీ చేసిన మల్టీజోన్ ఐజీ రంగనాథ్**

సుబేదారి, మార్చి 23 : కేయూసీ పోలీసు స్టేషన్ పరిధిలోని బాలికపై లైంగిక దాడికి యత్నించిన భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం సీఎం బండారి సంపత్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిన్నర క్రితం సంపత్ యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న సమయంలో ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య చనువు పెరిగింది. భర్త గమనించి అప్పటి సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశాడు. ఇదే క్రమంలో సంపత్ సదరు మహిళ కుమార్తెపై లైంగిక దాడికి యత్నించాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో కేయూసీ పోలీసు స్టేషన్‌లో సంపత్‌పై పోక్సో కేసు నమోదైంది. శనివారం పోలీసులు సంపత్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.




గాంధీభవన్ ఎదుట దేవరుప్పుల కార్యకర్తలతో కలిసి నినాదాలు చేస్తూ నిరసన తెలుపుతున్న పెద్ది కృష్ణమూర్తి

# హస్తవ్యస్తం..

- నల్ల శ్రీరామ్ వర్సెస్ పెద్ది కృష్ణమూర్తి
- పేరుకే కోడలు ఎమ్మెల్యే.. పెత్తనం అత్త ఝాన్సీరెడ్డిదేనని ధ్వజం
- పెద్ది కృష్ణమూర్తి వర్గం ఆందోళన

## దేవరుప్పుల కాంగ్రెస్‌లో వర్గపోరు
## గాంధీభవన్ వద్ద కార్యకర్తలతో నిరసన

దేవరుప్పుల, మార్చి 23 : పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల మండల కాంగ్రెస్‌లో గ్రూపుల పోరు రచ్చకెక్కింది. పార్టీ మండల అధ్యక్ష పదవి నుంచి పెద్ది కృష్ణమూర్తిని తొలగించడంతో శ్రేణుల్లో అగ్గి రాజుకుంది. నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తీసుకున్న నిర్ణయంతో కాంగ్రెస్ రెండు గ్రూపులుగా విడిపోయింది. మండల అధ్యక్ష పదవి నుంచి పెద్ది కృష్ణమూర్తిని తొలగించి, ఆ స్థానంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు, నీర్మాలకు చెందిన సీనియర్ నాయకుడు నల్ల శ్రీరామ్ పేరును ఝాన్సీరెడ్డి ఏకపక్షంగా ప్రకటించారని ఆరోపిస్తూ పెద్ది కృష్ణమూర్తి వర్గం నాయకులు నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. మొదటి రెండు రోజులు మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై రాస్తారోకో, ధర్నాలు చేపట్టారు. మూడో రోజు పెద్ది కృష్ణమూర్తి అనుచరుడు ఉప్పుల బాబు దేవరుప్పులలో సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. పెద్ది కృష్ణమూర్తికి తిరిగి మండల అధ్యక్ష పదవి ఇవ్వాలని, దీనిపై ఝాన్సీరెడ్డి ఇక్కడికి వచ్చి ప్రకటన చేయాలని గంట పాటు హల్‌చల్ చేశాడు. తాజాగా శనివారం పెద్ది కృష్ణమూర్తి వర్గం అనుచరులు, కార్యకర్తలు వందలాది మంది వాహనాల్లో హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు తరలివెళ్లి నిరసన తెలిపారు. పెద్ది కృష్ణమూర్తికి తిరిగి మండల అధ్యక్ష పదవి కట్టబెట్టాలని నినదించారు. పాలకుర్తిలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పేరుకే ఉన్నారని, పెత్తనమంతా ఆమె అత్త ఝాన్సీరెడ్డిదేనని కార్యకర్తలు ఆరోపించారు. ఈ క్రమంలో టీ-పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ వీరి వాదన విని న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో శాంతించారు.



గాంధీభవన్ వద్ద కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న పెద్ది కృష్ణమూర్తి

**ఝాన్సీరెడ్డి తీరు కాంగ్రెస్ పార్టీకే నష్టం - పెద్ది కృష్ణమూర్తి**

మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న. పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నో కష్టనష్టాలకోర్చి పార్టీని ముందుకు తీసుకెళ్లా. అసెంబ్లీ ఎన్నికల్లో యశస్వినీ రెడ్డిని ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించిన ఘనత దేవరుప్పుల కాంగ్రెస్ శ్రేణులకుంది. నియోజకవర్గ ఇన్‌చార్జీనని చెప్పుకుంటున్న ఝాన్సీరెడ్డి పలు పార్టీల నుంచి ఎంతోమందిని చేర్చుకుంటున్నారు. వారి మాటలే వింటూ తప్పుడు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే నన్ను అధ్యక్ష స్థానం నుంచి తొలగించి మరొకరికి ఇవ్వడం వెనక చాలా సంగతులున్నాయి. వనరుల దోపిడీ, ఇసుక అక్రమ రవాణాకు నేను అడ్డుగా ఉన్నానని తొలగించారు. ఝాన్సీరెడ్డిది ఈ దేశమే కాదు.. ఆమెకు కాంగ్రెస్‌లో సభ్యత్వమే లేదు. ఆమె పెత్తనం కాంగ్రెస్ పార్టీకి నష్టమే.

# దుఃఖాన్ని దిగమింగుకుని..



తండ్రి మృతదేహం వద్ద రోదిస్తున్న మహాలక్ష్మి


- తండ్రి బలవన్మరణంతో శోకసంద్రంలో కుటుంబం
- విషాదంలోనే పదో తరగతి పరీక్ష రాసిన మహాలక్ష్మి

బచ్చన్నపేట, మార్చి 23 : ఓ వైపు కంటికి రెప్పలా కాపాడిన తండ్రి తిరిగి రాని లోకాలకు వెళ్లాడు.. మరోవైపు పదో తరగతి పరీక్షలు.. కుటుంబం విషాదంలో ఉండగా దుఃఖాన్ని దిగమింగుకుని పరీక్ష రాసిన విద్యార్థిని ఉదంతం చూపరులను కంటతడి పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పడమటికేశ్వాపూర్‌కు చెందిన రైతు కొమ్మాట రఘుపతి భూ సమస్యలతో ఆందోళనకు గురై శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో రఘుపతి కుమార్తె మహాలక్ష్మి పుట్టెడు దుఃఖంలో శనివారం కొన్నెలో పరీక్ష రాసేందుకు వెళ్లింది. ఈ ఉదంతం స్థానికుల హృదయాలను ద్రవింప చేసింది. తండ్రి మృతదేహం ఇంటి వద్ద ఉండగానే పదో తరగతి పరీక్ష రాసి వచ్చి అంత్యక్రియల్లో పాల్గొంది. 'అయ్యోబిడ్డా.. ఎంత కష్టమొచ్చెనమ్మా..!' అంటూ బంధువులు కుటుంబ సభ్యులు, బంధువులు ఆవేదన వ్యక్తంచేశారు.

# ఉద్యోగాలపేరుతో దందా

**కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తామని భూపాలపల్లిలో దళారుల ఇష్టారాజ్యం**

- రూ.లక్షల్లో వసూలు చేస్తున్న ఏజెన్సీలు
- ఉద్యోగాలు రాక రోడ్డెక్కుతున్న నిరుద్యోగులు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఏజెన్సీలపై కానరాని చర్యలు




జయశంకర్ భూపాలపల్లి, మార్చి 23 (నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కాంట్రాక్టు ఉద్యోగాల దందా జోరుగా కొనసాగుతుంది. నిరుద్యోగుల అవసరాన్ని ఆసరా చేసుకొని దళారులు పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేస్తూ ఉద్యోగాలు ఇప్పించక, డబ్బులు తిరిగి ఇవ్వక నరకం చూపిస్తున్నారు. దళారుల దందా ఒకవైపు, ఏజెన్సీ సంస్థల దందా మరోవైపు .. మధ్యలో నిరుద్యోగ యువతీ యువకులు నలిగిపోతున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఏజెన్సీ సంస్థలు రూ.లక్షల్లో వసూలు చేస్తున్నారు. చివరికి ఉద్యోగాల కోసం ఎదురుచూసి విసిగిపోయి రోడ్డెక్కుతున్నారు. గ్రీవెన్స్ సెల్‌లో ఏజెన్సీ సంస్థపై ఫిర్యాదులు కూడా చేశారు. అయినా చర్యలు కరువయ్యాయి. జిల్లా కేంద్రాన్ని కేసీఆర్ ప్రభుత్వం ఊహించని విధంగా అభివృద్ధి చేసింది. వంద పడకల దవాఖాన (జిల్లా ఆసుపత్రి), సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్), మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి బాట చూపింది. కాగా, వంద పడకల వైద్యశాల, కలెక్టరేట్, మెడికల్ కళాశాలల్లో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తామని దళారులు, ఏజెన్సీ సంస్థలు నియోజకవర్గంలోని యువత, మహిళల వద్ద పెద్ద ఎత్తున వసూళ్ల పర్వం మొదలు పెట్టారు. సెక్యూరిటీ గార్డు, హౌస్ కీపింగ్, పేషెంట్ కేర్, వార్డు బాయ్‌లు, కంప్యూటర్ ఆపరేటర్స్ ఇలా పలు కాంట్రాక్టు ఉద్యోగాలకు ఒక్కొక్కరి వద్ద లక్షలాది రూపాయలు వసూళ్లు చేస్తున్నారు. డబ్బులు ఇచ్చినా పని కాకపోవడంతో బాధితులు దళారులు, ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. ఎలాంటి అర్హతలు లేకున్నా అధికారులకు ముడుపులు ఇచ్చి కొందరిని కాంట్రాక్టు ఉద్యోగాల్లో చేర్పించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు పని చేస్తున్న వారి అర్హతలు, వారి నివాస ప్రదేశం వివరాలు పరిశీలిస్తే అవినీతి బాగోతం బయటపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**కలెక్టర్‌కు ఫిర్యాదు**

జిల్లా ఆసుపత్రి , కలెక్టరేట్, మెడికల్ కళాశాలల్లో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తామని రూ. లక్ష నుంచి రూ.రెండు లక్షలు అడ్వాన్స్‌గా వసూలు చేసిన ఏజెన్సీ సంస్థపై బాధితులు కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. స్పార్క్ అండ్ సాయినాథ్ ఏజెన్సీ ప్రొప్రైటర్ ఎండీ ఖాజాపాషా తమ వద్ద డబ్బులు తీసుకుని మోసం చేశాడని బాధితులు జీ మల్లేశ్వరి, జీ మహేందర్, బీ లక్ష్మీనారాయణ, తిరుపతి, జీ రవీందర్, భద్రయ్య, రాజు, సంపత్, రాజేశ్వరి, సుమతి, సది తదితరులు వారు ఇచ్చిన డబ్బుల వివరాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమకు ఉద్యోగాలు కాదు తాము ఇచ్చిన డబ్బులు తిరిగి ఇప్పించి ఖాజాపై చర్యలు తీసుకోవాలని వారు వేడుకుంటున్నారు. స్పార్క్ అండ్ సాయినాథ్ ఏజెన్సీతో పాటు మరో ఏజెన్సీ నిర్వాహకులు సైతం ఉద్యోగాల దందా కొనసాగిస్తున్నారని బాధితులు పేర్కొంటున్నారు. దందాపై పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరుపాలని కోరుతున్నారు.

# ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా సుజాత

మహబూబాబాద్ రూరల్, మార్చి 23 : మహబూబాబాద్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా దామల్ల సుజాత శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించిన తస్లీమా మహ్మద్ శుక్రవారం కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారుల దాడిలో పట్టుబడ్డారు. ఆమె స్థానం లో వరంగల్ జోనల్ కార్యాలయం లో విధులు నిర్వర్తిస్తున్న దామల్ల సుజాతకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈమేరకు శనివారం ఆమె కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.



సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సుజాత

## తస్లీమా తీరుపై ఉన్నతాధికారుల ఆరా

మహబూబాబాద్ రూరల్, మార్చి 23 : లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ తీరుపై ఏసీబీ డీఎస్పీ సాంబయ్య స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ జిల్లా కార్యాలయానికి శనివారం నివేదిక పంపారు. మహబూబాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఆమె పనితీరు, ఇతర నాయకులతో ఎలా ఉండేదనే వివరాలను ఉన్నతాధికారులు ఆరా తీసినట్లు సమాచారం. ఈమేరకు నివేదికను జిల్లా కార్యాలయానికి ఇవ్వగా, వారు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కమిషనర్ ప్రధాన కార్యాలయానికి పంపనున్నారు. నివేదిక ఆధారంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోనున్నారు.

## గణితంలో రెండు మార్కులు కలుపాలి


ములుగురూరల్, మార్చి 23 : పదో తరగతి వార్షిక పరీక్షల్లో భాగంగా శనివారం గణిత ప్రశ్నపత్రంలోని 3వ ప్రశ్నకు రెండు మార్కులు కలుపాలని గణిత ఫోరం ములుగు జిల్లా అధ్యక్షుడు ఏళ్ల మధుసూదన్ ఎస్ఎస్‌సీ పరీక్షల విభాగ ఉన్నతాధికారులను శనివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రతి విద్యార్థి కనీస మార్కులు పొంది పాస్ అయ్యే అవకాశం ఉండగా కొన్ని అనుసంధాన ప్రశ్నలు పాఠ్య పుస్తకంలో లేనప్పటికీ ఇచ్చారన్నారు. 3వ ప్రశ్నలో ఒకచోట ఫ్లాగ్ పోల్ అని, మరోచోట టవర్ అని ఇవ్వడం వల్ల విద్యార్థులు గందరగోళానికి గురయ్యారని తెలిపారు. అందుకు ఆ ప్రశ్నకు సమాధానం రాసిన ప్రతి విద్యార్థికి రెండు మార్కులను కలుపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



ఉత్సవమూర్తుల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

# వైభవంగా వేంకటేశ్వరుడి రథోత్సవం

**చిల్పూరు వీధుల్లో ఉత్సవమూర్తుల ఊరేగింపు**



చిల్పూరు, మార్చి 23 : బుగులు వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మండల కేంద్రంలోని స్వామివారి ఆలయంలో వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా శనివారం ఉదయం హోమం, బలిహరణం నిర్వహించారు. సాయంత్రం అర్చకులు ఉత్సవమూర్తులను అలంకరించి రథంపై ప్రతిష్ఠించారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలతో భక్తులు గోవింద నామ స్మరణ చేస్తూ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మామిడాల యాదవరెడ్డి, ఎస్సై ముత్యం రాజేందర్, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి తీగల మహేందర్, నాయకులు సునీల్, మూల నాగరాజు, పంతం రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు సంగోజు మోహనాచారి, పెద్ది నారాయణ, పుల్యాల నారాయణరెడ్డి, జక్కుల రాజశేఖర్, కనకం మధు, గాజుల రజిని, బీ బాలరాజు, పీ కిరణ్‌రెడ్డి, మేకల మల్లేశం, ఎల్లయ్య, ఎ సత్యనారాయణ, బీ వికాస్‌రెడ్డి, ఉప్పరి గణేశ్, అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, శేఖర్, విశాల్, కృష్ణ, మహేశ్ పాల్గొన్నారు.

# వేతనాల కోసం పారిశుధ్య కార్మికుల ధర్నా

**నాలుగు నెలలుగా ఇబ్బంది పడుతున్నామని ఆందోళన**

వర్ధన్నపేట, మార్చి 23 : వేతనాల కోసం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు శనివారం ధర్నా చేశారు. నిత్యం తెల్లవారుజామునే రహదారులు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలను శుభ్రం చేసే తమకు అధికారులు నాలుగు నెలలుగా వేతనాలు అందించడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయమై రెండు నెలల క్రితం మున్సిపల్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అయినప్పటికీ మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో నెలలుగా వేతనాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. వేతనాల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా పాలక మండలి తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు వేతనాలను మంజూరు చేయాలని కార్మికులు కోరారు.



వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

# రామప్పలో వియత్నాం దేశస్తులు

వెంకటాపూర్, మార్చి 23 : ప్ర పంచ వారసత్వ కట్టడం రామప్పను శనివారం వియత్నాం దేశానికి చెందిన 26 మంది సందర్శించారు. ఆ దేశ ఉన్నతాధికారులు, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్స్, జర్నలిస్టులు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ సంస్థలో ఈ నెల 18నుంచి 30 వరకు వరకు శిక్షణ తీసుకునేందుకు వచ్చారు. ఇందులో భాగంగా మన చరిత్ర, వారసత్వ కట్టడాల గురించి తెలుసుకోవడానికి రామప్ప, వరంగల్ కోట, వేయి స్తంభాల గుడిని సందర్శించారు. అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ విశేషాలను అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, టూరిజం గైడ్‌లు వివరించగా ఆసక్తిగా పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. వారి వెంట ఎస్సై చల్ల రాజు, ఆర్ఐ రమేశ్, ఎంసీహెచ్‌ఆర్‌డీ అధికారు లు వడ్ల శ్రీనివాస్ ఉన్నారు.



రామప్పలో పూజలు చేస్తున్న వియత్నాం దేశస్తులు

## మహబూబాబాద్ డీఆర్‌డీఓ సస్పెన్షన్

మహబూబాబాద్ రూరల్, మార్చి 23 : మహబూబాబాద్ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న పురుషోత్తంను సస్పెండ్ చేస్తూ శనివారం పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో భూపాలపల్లి జిల్లాలో డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న సమయంలో విధుల్లో అలసత్వం, పరిపాలనలో నిర్లక్ష్యం, సెర్ప్ ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలు జరగ్గా, పూర్తి విచారణ చేసిన తర్వాత సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.